# సంస్కార దహనం

(స్వాతి మాస పత్రిక సెప్టెంబర్ 1998)

అయిదు సెకన్ల క్రితం ఆయన ఊపిరి ఆగిపోయింది. అయిదున్నర దశాబ్దాలుగా ఆయన్తో సహజీవనం సాగించిన భార్య గావుకేక పెడుతూ ఆ శరీరం మీద వాలి భోరున విలపించసాగింది.

ఆమె కేక విని ఒక్క ఉదుటున తలుపులు తెరచి ఆ ఇంట్లోకి పరుగులాంటి నడకతో ప్రవేశించాం నేను, నా భార్య. మా వెనకే ఇరుగుపొరుగువారు కూడా హడావిడిగా అక్కడికి చేరుకున్నారు.

ఆమెను ఓదార్చటానికి మాలో ఏ ఒక్కరికీ ధైర్యం చాల్లేదు. "పిన్నిగారూ....." అని మాత్రం అని ఆమెకు దగ్గరగా కూర్చుని పొదివిపట్టుకుంది మా ఆవిడ.

అనసూయమ్మగారి దుఃఖం రెట్టింపయింది. "అమ్మా....సుశీలా ....నన్ను ఒంటరి దాన్ని చేసి మీ బాబాయ్‌గారు వెళ్ళిపోయారమ్మా" అని వలవల ఏడ్వసాగిందామె.

"సాయంకాలం కూడా వరండాలో కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పారుగా....ఏమయిందసలు" ఆశ్చర్యంగా అడిగేడు ఎదురింటి నరసింహం.

"ఏమీలేదు బాబు. అన్నం కూడా తిన్నారు. పక్కలేసి వంట గది సర్దుకుంటున్నాను. చేతిలోనించి గ్లాసు జారి కిందపడింది. సరిగ్గా ఆ శబ్దంలోనే ఆయన గట్టిగా మూలిగినట్లు వినిపించి హడావిడిగా మంచం దగ్గరకు వెళ్ళాను. అంతే....అప్పటికే...." అని చెప్పి నుదురు బాదుకుంటూ విలపించిందామె.

అదృష్టవంతుడు. ఎవ్వరిచేతా ఒక్కపూట కూడా చేయించుకోకుండా పోయాడు. సునాయాస మరణం అందరికీ దక్కుతుందా"

"ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూవుండేవారు పాపం తాతయ్యగారు. ఒక్కసారన్నా ఆయన కోపంగా వుండటం చూళ్ళేదు.

ఇలా రకరకాలుగా ఎవరికి వాళ్ళు వాళ్ళకి తోచినవిధాన మాట్లాడసాగేరు.

ఇక రంగంలోకి దిగి తదుపరి కార్యక్రమం ప్రారంభించటం నా బాధ్యతగా భావించాను. వాళ్ల అబ్బాయికి, అమ్మాయికి, మిగిలిన ముఖ్యులకు టెలిగ్రాములు పంపించేందుకు అడ్రస్‌లు వ్రాసుకుని బయల్దేరేను.

అనసూయమ్మగారంటే అభిమానం కనపరచేవారంతా అక్కడ కూర్చుండి పోయారు. ఆ వీధిలో సగం పైగా వచ్చి పరామర్శించి వెళ్ళిపోయారు. విషయం తెలుసుకున్నవారు వచ్చి కాసేపు నిలబడి వెళ్తున్నారు. రాత్రిపూట కావటంతో కొంతమంది బద్ధకించి, మర్నాడు వెళ్ళొచ్చులెమ్మని మంచాలపై వాలేరు

అందరికీ టెలిగ్రాములు ఇచ్చేసి వచ్చాను. అనసూయమ్మగారి చెల్లెలు, దూరపు బంధువు మరొకరు వచ్చారు. సుశీలకూడా అక్కడే కూర్చునివుంది. వాళ్ళ పిల్లలు వచ్చేసరికి తెల్లవారుతుంది ఈ రాత్రంతా జాగారం చేయటానికే నిశ్చయించుకుని నేనూ అక్కడే కూర్చున్నాను.

అనసూయమ్మగారి పిల్లలు రావడం, తండ్రి శవం పట్టుకుని ఏడవటం, వారివి ఓదార్చటం వగైరాలన్నీ జరుగుతున్నయ్. కొడుకు వెంకట్రావుకు, నాకు కొద్ది స్నేహం కూడా వుండటంతో తదుపరి జరగవలసిన తతంగమంతా నన్ను చూడమని ప్రాధేయపడ్డాడు. జేబులో నుండి రెండువేల రూపాయలు తీసి నా చేతిలో పెట్టేడు.

సుశీల కాఫీ తయారుచేసి తీసుకువెళ్లింది. పిల్లలిద్దర్నీ మా అత్తగారింట్లో దింపి ముందుగా పురోహితుడి దగ్గరకు వెళ్ళాను

విషయం చెప్పేను. సావధానంగా విన్నాడు. చేతివేళ్లను ఒక్కొక్కటి ముడుస్తూ కళ్లు పెద్దవి చేసి, పెదవులు బిగించివిట్టూర్చాడు.

"దుర్ముహూర్తం కాదు దోషం ఏమాత్రం లేదు....సొంత ఇల్లే కాబట్టి వేరే అవరోధాలు కూడా ఏమీ వుండవ్"

"...."

"పదిగంటలకల్లా వస్తాను మరి బంధువులు ఎవరైనా ఇంకా దూరాల్నుంచి రావలసినవారున్నారా"

"అందరూ వచ్చేశారండి .... వాళ్లబ్బాయి, అమ్మాయి ఉదయాన్నే వచ్చేశారు. మిగిలిన వాళ్ళుకూడా ఈపాటికి వచ్చేవుంటారు ....మనం వీలైనంత త్వరగా ముగించటమే మంచిది. ఆమెకూడా పెద్దది, పైగా ఆరోగ్యం సరిగాలేదు" అన్నాను అనసూయమ్మగార విషయంగా.

నా మాటలు వింటూనే తెల్లకాయింతమీద కావలసిన సామాను వ్రాయటం పూర్తి చేశాడాయన. "ఇవిగో మీరు ఈ సామాన్లన్నీ చేర్చండి మీకు ఓ గంటకు పైగా సమయం పడుతుంది. అన్నట్టు మరి వాహకుల్ని బయటనుంచి మాట్లాడుకోవాలా .... మీలోనే ఎవరైనా వున్నారా"

"బయటవాళ్ళనే మాట్లాడాలి....ముందు మీకు విషయంచెప్పి అటుతర్వాత మిగిలిన పన్లుచూసుకుందామని ముందు మీదగ్గరకు వచ్చాను. ఇక్కడ్నుంచి వాళ్లదగ్గరకే వెళ్తాను"

"సరే అయితే త్వరగా వెళ్ళండి ఎండెక్కితే మళ్ళీ వాళ్ళు దొరకటం కష్టం.... ఇప్పుడయితే శివాలయం పక్కనే వుంటారు తెల్సుగా.

"తెలుసండీ....మరి....మీకు.... ఎంతవుతుందో చెప్తే" నసిగాను.

"మీకు తెలీనిదేముంది. మరి నిత్యకర్మంటారో చివరి మూడు రోజులూ చాలంటారో.... అవన్నీ తర్వాత సంగతి ముందు ఇవాళ్ళ కార్యక్రమం వరకు చెప్పమంటారో....దాన్నిబట్టి మరి మనం...."

అంత వివరం నాకూ తెలీదు. అందుకే ముందు దహన సంస్కార కార్యక్రమం వరకు ఎంతవుతుందో చెప్పమన్నాను.

"ఇవాళ దహనం, రేపు సంచయనం....ఈ రెండు పూర్తవ్వ వలసిందే మామూలుగా ఈ రెండురోజుల కార్యక్రమానికి వెయ్యి రూపాయలు....మీరు విచారించుకోండి....తప్పులేదు....ఆనక మరి మీ ఇష్టం" అని పంచాంగం తెరచి చూసుకోనారంభించాడు.

"ఏదో కనిపెట్టి చెప్పండి....వాళ్లూ పెద్దగా స్థితిమంతులేం కాదు...."

"అబ్బే అలా చెప్పేవాడ్ని కాదండి నేను. మీరు వేరే ఎవరి దగ్గరైనా విచారించుకునేరండి మరేంఫరవాలేదు అలాచెప్పనసలు"

"...."

"నిజానికి ఇవ్వాళ నేను రావలసినిన పనికాదు....ఇక మీరుగా వచ్చారని కాదన్లేక రావటమే. పనులు బాగా వత్తిడిగా వున్నయ్యండి"

"ఇంకే అవకాశం లేదంటారా"

"అలా వుండదండీ మీరు కాబట్టి నేను వెయ్యి అడిగేను. అందరూ పన్నెండు వందలకు తక్కువ చేయటంలేదు" అని కుర్చీ లోంచి లేచాడు.

"సరే త్వరగా రండి" అని చెప్పి సరుకుల పట్టీ అందుకుని వాహకులుండే శివాలయం వైపు బయల్దేరేను.

గుడి గోడనానుకుని కొందరు, అరుగుమీద కొందరు కూర్చుని వున్నారు. వారిలో ఎవర్ని అడగాలా అని తటపటాయిస్తూ నిల్చు న్నాను. నా వాలకం చూసి పసిగట్టినట్లుగా లేచివచ్చాడో వ్యక్తి "ఏంటండీ" అంటూ పలకరించాడు.

"శవ వాహకులు ఇక్కడ వుంటారుటగా"

"అఁ....నేనేలేండి....ఏ పేటా" అడిగాడు.

చెప్పేను.

"రోజూ ఈ పాటికి వచ్చేసేవాళ్లండి. ఇవ్వాళెందుకో రాలేదు మరి వేరే పనికేమైనా వెళ్ళారేమో.... ఇంతకుముందే ఇంకొకాయన కూడా వచ్చి మళ్ళీ వస్తానని వెళ్ళాడు"

"వస్తారుగదా ఇక్కడికే" అన్నాను అసహనంగా.

"రావాలిమరి.... ఒక్కోరోజు దొరకరండి బాబూ. ఓ పట్టాన చిక్కరు సావగొడతారు"

"...."

"మనకి మరి నలుగురూ కావల్సిందేనా....ఇంటివాళ్లు ఎవరైనా వున్నారా"

"నలుగురూ కావాలి."

"అబ్బో .... కష్టమేనే .... సరే నే వెళ్ళి వెతుక్కువస్తాలెండి. కొంచెం ఆలస్యం అయినా నలుగుర్ని పోగేసుకుని వస్తాగా. ఇదిగో ఈ చీటీమీద అడ్రస్ కాస్త రాసీయండి. తెలుగులో రాయండి లైను, అడ్డరోడ్డు అన్నీ వివరంగా రాయండి మళ్ళీ మేం యిబ్బంది పడకుండా"

"ఎంతివ్వాలి నలుగురికీ" అడిగేను భయంగా.

"మనిషికి రెం కొందలు .... మామూలేగా" అంటూ బీడీ వెలిగించాడు.

'పోయింది ఒక్క మనిషే' అన్నాను కసిగా.

'అది కాదండీ వాహకులు నలుగురికీ నాలుగు రెన్ను ఎనిమి దొందలు .... అదీ లెక్క.'

'ఎనిమిది వందలా'

'డబ్బుల సంగతి అట్లా వుంచండి. అసలు ఇవ్వాళ మనుషులు దొరుకుతారా లేదా అని నేను సందిగ్ధంతో పడ్డా. మీకు మాటిచ్చి మళ్ళీ నేను ఇబ్బంది పడాల, మిమ్మల్ని ఇబ్బంది పెట్టాల కదా .... అదీ నా బాధ.'

'ఇక వేరే మాటేం లేదా?'

'అదే తక్కువ బాబు. ఈ ఎండలకి పైగా మీ పేటలో పోయి పోయి ఏడకో ఆ మూలకి పోవాల. మీకు తెలీని కష్టమా'

'సరే.ఆలస్యం చేయకుండా రండి ఇదిగో అడ్రస్ కాయితం' అంటూ కదలబోయాను.

'ఓ పది ఇయ్యండి. వచ్చే ముందు నలుగురం కాపీలు తాగి వస్తాం' అని చేయి చాచేడు.

గత్యంతరం లేక పది నోటిచ్చి కదిలేను.

వెంకట్రావుకు లెక్క చెప్పి పురోహితుడు ఇచ్చిక పట్టి చూ పెట్టాను.

మరో మాట మాట్లాడకుండా నోట్లకట్టతీసి ఇంకో మూడు వేలు నా చేతికిచ్చాడు.

రాత్రంతా నిద్ర లేని కారణంగా కళ్ళు మండుతున్నయ్. మూతలు పడుతున్నయ్. పైగా ఎండాకాలం కూడా కావటంతో ఎన్ని నీళ్ళు తాగినా తనివి తీరటంలేదు. హొటల్‌కి వెళ్ళి టిఫిన్, కాఫీ తీసుకుని బయల్దేరాను.

వేపచెట్టు కింద వెదురు బొంగులు నరుకుతూ కూర్చుందో ఆడమనిషి. ఇంకొకావిడ పక్కనే చాటలు అల్లుతున్నది. ఓ పన్నెం డేళ్ళ కుర్రవాడు విసనకర్రలు విగిస్తున్నాడు.

'ఏం కావాలి బాబూ' బొంగు నరకటం ఆపి అడిగింది ముసలమ్మ.

'శవం తీసుకువెళ్లేం....'

నా మాట పూర్తికాకముందే పక్కనున్న సందులోకి వెళ్ళి అక్కడ గోడకు ఆనించి వున్న ఓ కట్ట తీసుకువచ్చి అందించింది.

'రెడీమేడ్' అనుకున్నాను మనసులో.

"ఎంతమ్మా"

"వందియ్యయ్యా" అంటూ చేయి జాపింది.

"ఏంటి ఆ రెండు బొంగులు, ఆరేడు బద్దెలు వంద రూపాయలా"

"వందరూపాయలా! అని ఆశ్చర్యపోతన్నావేందయ్యా ఈటికి బేరాలుండవ్ ఇట్టమైతే తీస్కో లేకుంటే ఎరే చోటికి పో" కొట్టినంత పని చేసిందామె.

'ఎక్కడికి వెళ్ళినా ఇంతేనేమో! ఎందుకొచ్చిన తిప్పలు' అనుకుని వందకాయితం ఆమెకి ఇచ్చి బొంగుల కట్ట అందుకున్నాను.

కుండలు, మూకుళ్ళు ఎక్కడుంటాయో ఆమెనే అడిగి తెలుసుకున్నాను.

బొంగుల కట్ట చేతపట్టుకుని నడుస్తున్న నన్ను చూసి నాకేం కావలసిందీ ఇట్టే పసిగట్టినట్లు వరసగా బారులు తీర్చి కూర్చున్న వాళ్లంతా పోటీపడి నన్ను పిలవసాగేరు.

ఓ చోట ఆగేను. నే చెప్పే అవసరం ఏమీ లేనట్టు ఓ కుండ, రెండు మూకుళ్ళు, మూడు ముంతలు వగైరా....వగైరా తెచ్చి నా ముందుంచాడు. పక్కనే వున్న తాటాకుల బుట్టలోకి మూకుళ్ళు, ముంతలు సర్ది కుండను బుట్టపక్కన పెట్టి నా వైపు చూశాడు పనైపోయిందన్నట్లు. ఇతరత్రా మాటలు అనవసరం అనుకుని "ఎంత?" అన్నాను.

"అరవై రూపాయలు కందడీ" అన్నాడతను. ఆదేదో అంతర్జాతీయ ధర అన్నట్లు.

మరో మాటకు అవకాశం ఇవ్వకుండా ఓ యాభై కాయితం, ఓ పది కాయితం అతనికి ఇచ్చి అటుగా వెళ్తున్న రిక్షాని పిలిచాను.

నా పక్కనున్న సరంజామా చూసి మంచి గిరాకీ అనుకున్నట్లున్నాడు.

"ఎడికండీ" అంటూ రిక్షా పక్కగా తెచ్చి నిలిపాడు.

అడ్రస్ చెప్పేను. పన్నెడు రూపాయలడిగేడు. పదిరూపాయలకు బేరం కుదిరింది సరంజామా అతనే రిక్షాలో పెట్టేడు. నేను ఎక్కి కూర్చున్నాను.

బాబూ ఆ బట్టల కొట్టుదగ్గర ఆపు....ఒక్క రెండు నిమిషాల్లో వచ్చేస్తాను"

రిక్షా బట్టల కొట్టుముందు ఆగింది.

నేను లోపలికి వెళ్తావుండగానే షాపతను 'కర్తలెంతమందండీ' అడిగేడు.

"ఒక్కరే" అన్నా అతని లౌక్యానికి ఆశ్చెరువొంది.

"ఆరు, మూడున్నర ముక్కొక్కట్టి. నాలుగు మూడు ముక్కొక్కటి, రెండున్నర, రెండు ముక్క ఒకటి, మొత్తం మూడు ముక్కలు కత్తిరించరా" అని గుమస్తాకి చెప్పేడు.

"పంచల చాపులొద్దా బాబూ....కండువాలు కూడా కావాలిగా" అడిగేడు.

పురోహితుడి లిస్టు తీసి చూశాను. రెండు కండువాలు కూడా కావాలని రాశాడు.

'కండువాలు రెండు కావాలండీ" చెప్పేను షాపాయనతో.

'ఆఁ ...ఒరే రెండు .... ఒకటిన్నర కండువాలు, చౌక రకం వున్నయ్ చూడు. దానాలకి ఇచ్చేవి అవి కూడా రెండు తీ' అంటూ బిల్లుపుస్తకం అందుకున్నాడు బరబర బిల్లు గీకేశాడు. బట్టల కవర్లో పెట్టి పిన్ కొట్టి, బిల్లు, కవరు నా చేతికి అందించాడు.

డబ్బులిచ్చి బట్టల కవరుతో రిక్షా ఎక్కేను.

పదిహేను నిమిషాల్లో రిక్షా ఇంటిముందు ఆగింది. అప్పుడే అనసూయమ్మగారి అక్కా బావగారు వచ్చారట వారిని పట్టుకుని పెద్దగా ఏడుస్తున్నది ఆవిడ.

వాహకులు నలుగురూ వచ్చేశారు. ఎదురింటి అరుగుమీద కూర్చుని కబుర్లాడుకుంటున్నారు పురోహితుడు ఒకసారి వచ్చి వెళ్ళాడట. మరో అరగంటలో వస్తానన్నాడట.

సుశీల అందించిన కాఫీ తాగుతూ జేబులోంచి లిస్టు తీసి చూడసాగేను. ఇంకా చేరవేయవలసిన సామాగ్రి వివరాలకోసం.

'పిడకలు' ముందుగా నా కంటపడింది. మూడిళ్ల అవతలే వెంకాయమ్మ ఇంట్లో కావలసినన్ని పిడకలు. వాళ్ల ఇంటి కాంపౌండ్ గోడ, వాళ్ళ ఎదురుగా వున్న మలేరియా ఆఫీసు బిల్డింగ్ గోడ వారానికి అయిదు రోజులు పిడకల్తోనూ, రెండు రోజులు పిడకల ముద్రల్తోనూ నిండివుంటయ్.

కాఫీ తాగేసి వెంకాయమ్మ ఇంటికి వెళ్ళాను ఖాళీ బస్తా ఒకటి చేతపట్టుకుని. ఇంటిముందంతా పిడకలు కుప్పలుగా పోసివున్నయ్. నన్ను చూసి బయటకు వచ్చిందావిడ.

"పిడకలు కావాలమ్మా" అన్నాను బస్తా ఊపుతూ.

'అనసూయమ్మగారింటికేనా బాబూ.... మేమియ్యం అయ్యా' అన్నది వెంగుతో చేతులు తుడుచుకుంటూ.

అర్థంకానట్లు చూశాన్నేను.

'అశుభాలకి పిడకలమ్మం బాబూ మేము మీక్కావాలంటే ఆరోల్లిల్లో వుండారు. వాళ్లయితే ఇస్తారు' అని వాళ్ళ ఇంటి అడ్రస్ చెప్పిందామె.

'పిడకల వేటలో ఇంత రామాయణం వుందా' అనుకుంటూ ఆరోల్లైనుకు నడక సాగించాను. అంతలోనే ఓ ఆలోచన వచ్చి మళ్ళీ వెంకాయమ్మ ఇల్లోకి వెళ్ళి వంద పిడకల ధర ఎంతో కనుక్కొన్నాను. పది రూపాయలని తెలుసుకున్నాను.

అపపరాలు, నూనెలు వగైరాల ధరల్తోపాటు పిడకల ధర కూడా రేడియోలోనూ, దూరదర్శన్‌లోనూ చెప్పటం అవసరమేమో అనిపించింది.

ఆలోచనల్లమధ్య ఆరోల్లైన్లో పిడకలమ్మేవాళ్ల ఇంటిముందుకి చేరుకున్నాను.

"ఓ వంద పిడకలు కావాలండీ" అడిగేను.

'పాపం.... ముసలాయన పోయాడంటగా బాబూ.... మంచాన పడకుండా పోయాడ్లే' అంటూనే యాభై పిడకలకి ఒక్కటి ఎక్కువా కాకుండా. తక్కువా కాకుండా బస్తాలో వేసింది.

"చితుకుపుల్లలు కూడా పెట్టానయ్యా....కావాలిగా ... ఇచ్చేదా" అడిగిందామె

మళ్ళీ వాటికోసం ఇంకోచోటికి ఎందుకు లెమ్మనని తలాడించేను ఇమ్మన్నట్లు.

సందులోకి వెళ్ళి ఓ డబ్బానిండా పుల్లలు తెచ్చి బస్తాలో పోసింది.

"రెండూ కలిపి ఎంతమ్మా" అడిగేను.

"పిడకలు యాభై కదయ్యా పదిహేను రూపాయలు, చితుకులు పదిరూపాయలు.... మొత్తం పాతిక బాబు "చెప్పి పిడకలు కాళ్ళతో పక్కకు నెట్టింది.

ఆలోచిస్తూ నిల్చున్నానేను.

"అశుభాలకందరూ ఈరు గదయ్యా అందుకే రేటు పెచ్చు ....మామూలుగా అయితే పిడకలు వంద పదే" అంటూ నవ్విందామె

మౌనంగా (రోదిస్తూ) పాతిక రూపాయలు ఆమెకిచ్చి బస్తా చేతపుచ్చుకుని ఇంటి దారి పట్టేను. పిడకలూ, చితుకులూ ఇంటికి చేర్చేసరికి పురోహితుడు కూడా వచ్చి ఉన్నాడు.

"సామాగ్రి అంతా వచ్చేసినట్లేనా" అడిగేడు.

'అన్నీ వచ్చేసినయ్ .. ఇక మీదే ఆలస్యం' అన్నాను.

అవును మరి శ్మశానంలోకి కట్టెలు పంపటం, వెట్టి మనిషికి డబ్బులిచ్చి రావడం పూర్తయిందా" అడిగేరు వాహకులు.

అప్పుడుగానీ ఆ విషయం స్ఫురణకు రాలేదు నాకు.

ఇప్పుడే వచ్చేస్తా"నంటూ సైకిలందుకుని రివ్వున వెళ్ళాను.

వెట్టిమనిషి కోసం వాకబుచేశాను. నా మాటలు వినపడి ఓ బక్కపల్చని మనిషి ఇంట్లోంచి బయటకు వచ్చాడు. అతని వెనకాలే మరో ఇరవై ఏళ్ల కుర్రాడు వచ్చి నిల్చున్నాడు.

వివరాలు చెప్పేను టన్ను కట్టెలు కావాలన్నాడు. అయిదు లీటర్ల కిర్సనాయిల్ కావాలన్నాడు. ఆ కిర్సనాయిల్ తీసుకువెళ్లేందుకు ఖాళీ డబ్బాలు కావాలన్నాడు. ఇవన్నీ మనం ఏర్పాటు చేసుకుంటే తన పని తను చేసినందుకు ఎనిమిది వందలు ఇవ్వాలట. కట్టెలు వగైరాలు కూడా అతనే చేర్చుకునేట్లయితే పదిహేనువందలు ఇవ్వమన్నాడు.

అతడి మాటలకు తల తిరిగిపోయింది నాకు "అంత డబ్బా" అన్నాను.

"మీరు విచారించుకునే ఇవ్వండి బాబూ" మరో మాటకు అవకాశం ఇవ్వకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

ఇంక వేరే దారేం కనిపించలేదు. అయినా ఏముంటుంది. ఆ పనిచేసేది వాళ్లే. వాళ్లు ఎంత అడిగితే అంతా ఇవ్వక తప్పదని అర్థమైంది. అయినా బేరమాడి చూశాను.

పదిరూపాయలు కూడా తగ్గమని చెప్పటం కాక అతనడిగించా నికి మరో పాతిక తీసుకున్నాడు కట్టెలు శ్మశానానికి చేరవేయ టానికి రిక్షా బాడుగ నిమిత్తం.

అసహాయంగా పదిహేనువందలపాతికమట్టచెప్పివెనుతిరిగేను

వాహకులు బొంగుల కట్ట విప్పి సవారి సిద్ధపరుస్తున్నారు.

పురోహితుడు పసుపు, కుంకుమ, బియ్యం వగైరా పొట్లాలన్నీ దగ్గరపెట్టుకునిఇంకా కావలసిన గ్లాసు,నీళ్ళకోసం పురమాయిస్తున్నాడు

ఓ అయిదు రూపాయలకు చిల్లరనాణేలు అక్కడ పెట్టమన్నాడు

మృతదేహాన్ని బయటకు తెచ్చేటప్పుడు అందరూ ఒక్కసారి బావురుమన్నారు.

పదినిమిషాల్లో తతంగం పూర్తిచేశారు పురోహితులు

వాహకులు నడుం బిగించి నిల్చున్నారు. పిల్లలు, పెద్దలు భౌతికకాయం చుట్టూ తిరిగి కాళ్లకి సమస్కారం చేస్తూ, కన్నీరు తుడుచుకుంటున్నారు.

ఆ సాయంత్రానికి వెంకట్రావుకు లెక్కలు అప్పగించాను.

ఒళ్ళంతా పగుల కొట్టినట్లనిపించింది. చాప, దిండు తీసుకుని డాబామీదకు వెళ్ళాను. కునుకు పట్టలేదు. పిండాల దగ్గర్నుంచీ పిడకల దాకా ప్రతి సంఘటన నన్ను కలవరపరచింది.

ఇంతకీ చనిపోయిన వ్యక్తి పేరు చెప్పనేలేదుకదూ! ఎవరైతేనేం 'గుర్తు తెలిసిన శవం' అనుకుంటే సరిపోలా.

"ఏదిఏమైనా కనీసం అయిదువేలైనా చేతిలో లేకపోతే ఎలా ఛస్తాం' అనిపించింది.

"దహన సంస్కారం" అనే మాటకు వ్యుత్పత్తి అర్థం కొత్తగా గోచరించింది.

—o—